సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 8 । జనవరి । 2023

I



ప్రపంచంలోనే పెద్ద బెరైటీస్ నిక్షేపం మంగంపేట

ప్రపంచంలో అతి పెద్ద బెరైటీస్ నిక్షేపాలు మంగంపేటలో ఉన్నాయని ఏపీయూ శాస్త్రవేత్తల బృందం డైరెక్టర్ అన్నారు. -IIలో



అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

రద్దీగా ఉన్న బ్యాంకుల్లో ఖాతాదారుల దృష్టి మరల్చి చోరీకి పాల్పడే అంతర్ రాష్ట్ర దొంగను పోలీసులు పట్టుకున్నారు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.150
రెండోరకం	రూ.70	రూ.108

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 158 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	590	699
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 519.14 కిలోలు

న్యూస్‌రీల్

గెస్ట్‌హౌస్ పనుల పరిశీలన



ప్రభుత్వ గెస్ట్‌హౌస్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: గెస్ట్‌హౌస్ నిర్మాణం ముందు భాగంలో పరిసర ప్రాంతాల చదును పనులలో వేగం పెంచాలని కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ వెనుకభాగంలో నిర్మిస్తున్న గెస్ట్‌హౌస్ నిర్మాణం పనులను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గెస్ట్‌హౌస్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా అందుబాటులోకి తేవాలన్నారు. చురుగ్గా జరుగుతున్న రోడ్డు పనులు పరిశీలించి అక్కడున్న కాంట్రాక్టర్, ఇంజినీరింగ్, మున్సిపల్ కమిషనర్‌లకు కలెక్టర్ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ రాంబాబు, ఆర్అండ్‌బీ డీఈ సురేష్ నాయక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఖేలో ఇండియాలో నమోదు చేయించుకోవాలి

రాయచోటి : ఖేలో ఇండియాలో వ్యాయామ ఉపాధ్యాయులంతా నమోదు చేయించుకోవాలని అన్నమయ్య జిల్లా డీఈఓ వై.రాఘవరెడ్డి అన్నారు. రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ సురేష్ కుమార్ ప్రతి జిల్లాలో ఖేలో ఇండియా కోఆర్డినేటర్లను నియమించారని డీఈఓ ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా కోఆర్డినేటర్‌గా కొత్తపేట జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఎ.బాలశేఖర్‌ను నియమించారన్నారు. అలాగే ప్రతి నియోజకవర్గం, మండల కోఆర్డినేటర్లను కూడా నియమించామన్నారు. జిల్లాలోని ప్రతి స్కూల్ షీట్‌లో ఖేలో ఇండియా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.

- వైఎస్సార్ స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్ భూమి పూజకు సన్నాహాలు
- జేఎస్‌డబ్ల్యు స్టీల్ లిమిటెడ్‌కు 3148 ఎకరాలు భూమి అప్పగింత
- రూ.713 కోట్లతో మౌలిక వసతుల కల్పన
- రైల్వే కనెక్టివిటీ కోసం 9.4 కిలో మీటర్లు రైల్వేలైన్ నిర్మాణం
- 7.5 కిలోమీటర్ల మేరకు ఫోర్‌వే రోడ్డు ఏర్పాటు
- మైలవరం జలాశయం నుంచి రెండు టీఎంసీల నీరు సరఫరా
- ఫేజ్-1లో రూ.3300 కోట్ల పెట్టుబడులు

యంత్రాలతో పనులు చేస్తున్న దృశ్యం



స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి వడివడిగా అడుగులు

సాక్షి ప్రతినిధి, కడప: అండగా నిలిచిన ప్రాంతం శాశ్వత అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. నిరుద్యోగం పారదోలి మెరుగైన జీవనోపాధి కల్పించాలనే ఆశయంతో సొంత జిల్లాలో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో నాలుగులేన్ల రోడ్డు, ట్రైన్ కనెక్టివిటీ, నీటి వసతి, విద్యుత్ సరఫరా పనులు వేగవంతం అయ్యాయి. మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం శరవేగంగా స్పందిస్తోంది. వైఎస్సార్ స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్ భూమిపూజకు వడివడిగా అడుగులు పడుతున్నాయి.

పట్టించుకోని టీడీపీ..

వెనుకబాటుకు గురైన రాయలసీమ నడిబొడ్డున కడప గడపలో స్టీల్ ప్లాంట్ నిర్మించాలని విభజన చట్టంలో పొందుపరిచారు. తద్వారా నిరుద్యోగులకు మెరుగైన జీవనం లభిస్తోందని అనుబంధ పరిశ్రమలు ద్వారా మరింత ఉపాధి లభిస్తుందని తలిచారు. అయితే గత టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించింది. తీరా ఎన్నికలకు ముందు 2018లో ఓ పునాది రాయితో చంద్రబాబు సర్కార్ సరిపెట్టింది.

బాధ్యతగా వైఎస్సార్‌సీపీ..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్టీల్ ప్లాంట్ నిర్మించాలనే ఆశయాన్ని భుజానికెత్తుకుంది. సీఎంగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 డిసెంబర్ 23న స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. ఏపీ హైగ్రేడ్ స్టీల్స్ లిమిటెడ్ పేరిట నిర్వహణకు సన్నహాలు చేపట్టారు. కాగా 2020 ఫిబ్రవరి నుంచి కరోనా వైరస్ వ్యాప్తితో ప్రపంచమే అతలాకుతలమైంది. మానవుల జీవనం అస్తవ్యస్తంగా తయారయింది. రెండేళ్ల పాటు ఇలాంటి పరిస్థితి కొనసాగుతూ రావడంతో ప్లాంట్ నిర్మాణానికి ప్రతిబంధకంగా మారిందని నిపుణులు వివరిస్తున్నారు.

జేఎస్‌డబ్ల్యు స్టీల్స్ లిమిటెడ్‌కు భూమి అప్పగింత

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల చేపట్టిన జిల్లా పర్యటనలో జేఎస్‌డబ్ల్యు స్టీల్స్ లిమిటెడ్ ద్వారా జమ్మలమడుగు సమీపంలో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి ఈనెలలో భూమి పూజ చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. కాగా జీఓ ఎంఎస్ నంబర్ 751 ద్వారా ఎకరం రూ.1.65 లక్షలతో 3,148.68 ఎకరాలు కేటాయిస్తూ 2022 డిసెంబర్ 16న ఉత్తర్వులు జారీ చేశారు.

- ఈ స్టీల్ ప్లాంట్ తొలివిడతలో ఏడాదికి 1 మిలియన్ టన్నులు (10 లక్షల టన్నులు) ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మాణం కానుంది. అందుకోసం ఫేజ్-1లో రూ.3,300 కోట్లు వెచ్చించనున్నట్లు అధికార యంత్రాంగం స్పష్టం చేస్తున్నారు. 36 నెలల కాలపరిమితిలో ఫేజ్-1 పనులు పూర్తి కానున్నాయి. తొలివిడతలో వైర్ రాడ్స్ మరియు బార్ మిల్స్ ఉత్పత్తి చేయనున్నారు. మరో రూ.5.500 కోట్లుతో ఫేజ్-2 నిర్మాణ పనులు పూర్తి కానున్నాయి. ఫేజ్-2 సైతం 2029 మార్చి నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

మౌలిక వసతుల కల్పన

స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి కావాల్సిన మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం రూ.713 కోట్లు వెచ్చిస్తోంది. నాలుగులైన్ల రహదారి, రైల్వే కనెక్టివిటీ, నీటి వసతి కోసం పైపు లైన్ ఏర్పాటు, నిల్వ చేసుకునేందుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, విద్యుత్ సరఫరా, కాంపౌండ్ వాల్, భవన సముదాయం నిర్మించనున్నారు. అందులోభాగంగా ఎన్‌హెచ్-67 నుంచి ముద్దనూరు టు జమ్మలమడుగు రోడ్డుకు అనుసంధానంగా రూ.145.3 కోట్లతో 12 కిలోమీటర్లు నాలుగు లైన్లు రహదారి నిర్మించనున్నారు.

- యర్రగుంట్ల టు ప్రొద్దుటూరు రైల్వేలైన్ నుంచి రూ.323.5 కోట్లతో 9.4 కిలో మీటర్లు రైల్వేలైన్ నిర్మాణం చేపట్టనున్నారు. మైలవరం జలాశయం నుంచి 2 టీఎంసీల నీరు సరఫరా చేయనున్నారు. అందుకోసం 15 కిలోమీటర్లు పైపులైన్ నిర్మించనున్నారు. ఇప్పటికే విద్యుత్ సరఫరాకు కావాల్సిన చర్యలు పూర్తయ్యాయి.
- రూ.76.42 కోట్లతో 27 కిలోమీటర్ల మేరకు విద్యుత్ లైన్ ఏర్పాటు, 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తి అయింది. 20 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన సంప్ నిర్మాణం ఫినిషింగ్ దశలో ఉంది. చుట్టూ ప్రహరీ, భవన సముదాయం వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయి. ఇంటర్నల్ రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయి. వైఎస్సార్ స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్ స్టీల్ ప్లాంట్ భూమిపూజ నాటికి కావాల్సిన మౌలిక వసతుల కోసం వడివడిగా పనులు చేస్తుండడం విశేషం. కాగా అధికారికంగా సీఎం వైఎస్ జగన్ పర్యటన ఖరారు కావాల్సి ఉంది.



రూపుదిద్దుకున్న విద్యుత్ సబ్‌స్టేషన్

యువతకు ఉపాధి కల్పించడమే సీఎం లక్ష్యం



పారిశ్రామికాభివృద్ధి సాధించి జిల్లాలోని యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలనే కృత నిశ్చయం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలో మెండుగా ఉంది. ఆ మేరకే స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సమగ్ర, స్పష్టమైన ప్రణాళికతో భూమి పూజకు సిద్ధమౌతున్నారు. అటు కొప్పర్తి పారిశ్రామికవాడ, ఇటు వైఎస్సార్ స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్‌తో జిల్లా రూపురేఖలు మారనున్నాయి. లక్షలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. స్టీల్ ప్లాంట్ నిర్మాణంతో భవిష్యత్‌లో జమ్మలమడుగు పెద్ద సిటీగా చూడనున్నాం.

– వైఎస్ అవినాష్‌రెడ్డి, కడప ఎంపీ



నిర్మాణ దశలో ఉన్న షెడ్లు

సర్వైకల్ క్యాన్సర్ అవగాహన మాసోత్సవాలు



వైద్యులతో కలసి సర్వైకల్ క్యాన్సర్ మాసోత్సవాల బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

రాయచోటి అర్బన్: సర్వైకల్ క్యాన్సర్ (గర్భాశయ ముఖద్వార క్యాన్సర్)పై అవగాహన మాసోత్సవాలను విజయవంతం చేద్దామని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం. కొండయ్య పిలుపునిచ్చారు. ఏపీ వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వారి ఆదేశాల మేరకు జనవరి మాసం మొత్తం సర్వైకల్ క్యాన్సర్ అవగాహన మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని ఆరోగ్యకేంద్రాలు, గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంతో పాటు మహిళలకు, కిషోర బాలికలకు స్క్రీనింగ్ నిర్వహిస్తామన్నారు. గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి, సరైన చికిత్స తీసుకోవడం ద్వారా పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. అనంతరం తన కార్యాలయం ముందు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ అవగాహన మాసోత్సవాల బ్యానర్‌ను ఆయన జిల్లా ప్రోగ్రాం అధికారులతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ శేషగిరిబాబు, డీఎస్‌ఎంఓ విష్ణువర్ధన్‌రెడ్డి, డీఎస్ఓ రియాజ్‌బేగ్, డిప్యూటీ డెమో దేవశిరోమణి, డీఎంఓ వేణుగోపాల్, సీహెచ్‌ఓ నారాయణతో పాటు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వందేళ్ల చెట్టు.. జ్ఞాపకం మిగిలేట్టు



ప్రభుత్వం రూ.480.10 కోట్లతో ములకలచెరువు-మదనపల్లె జాతీయ రహదారి అభివృద్ధి, విస్తరణ పనులు ప్రారంభించింది. దీంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పెద్ద పెద్ద వృక్షాలను తొలగిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం సుమారు 110 ఏళ్ల క్రితం నాటి చింత చెట్లు తొలగించారు. ఈ చెట్లు సుమారు 110 ఏళ్లపాటు నీడనిచ్చాయి. పశువులు, గొర్రెల మందలు చెట్ల కింద సేదతీరాయి. ఇలా ఈ చెట్లతో స్థానికులకు అనుబంధం ఏర్పడింది. దీంతో ఆ చెట్లతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ వారు ఈ దృశ్యాన్ని ఆసక్తిగా తిలకించారు. -బి.కొత్తకోట

కలెక్టరేట్‌కు కొత్తకళ

- కలెక్టరేట్‌కు రోడ్లు, మొక్కలతో కొత్త అందం
- కడప-చిత్తూరు జాతీయ రహదారి ఆనుకుని కలెక్టరేట్ స్వాగత తోరణం
- ప్రత్యేకంగా 102 అడుగుల టవర్ ఏర్పాటు చేసి జాతీయ జెండా ఆవిష్కరణకు ఏర్పాట్లు
- కలెక్టరేట్ నూతన భవనాలకు 45 ఎకరాల స్థల సేకరణ
- కలెక్టర్, జేసీ, డీఆర్వోల బంగ్లాలు ఎనిమిది ఎకరాల్లో నిర్మాణాలు
- అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో కలెక్టరేట్‌కు ఒనగూరుతున్న వసతులు



రాయచోటిలోని కలెక్టరేట్ భవనం

సాక్షి రాయచోటి: రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనలో భాగంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని కలెక్టరేట్ ప్రాంగణం నూతన హంగులు సంతరించుకుంటోంది. 2022 ఏప్రిల్ 4వ తేదీన అన్నమయ్య జిల్లా ఆవిర్భవించింది. అప్పట్లో రాయచోటిలోని కడపకు వెళ్లే రింగ్‌రోడ్డు సర్కిల్ సమీపంలో కలెక్టరేట్ ఏర్పాటు చేశారు. అయితే అధునాతన భవనాలతోపాటు ఫ్లోరింగ్, ఇతర పనులు చేయడంతో కలెక్టరేట్ భవనాలకు కొత్తకళ వచ్చింది. జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీషా కలెక్టరేట్‌కు అవసరమైన సదుపాయాలకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో ఫర్నిచర్‌తోపాటు ఇతర వసతులు ఒనగూరాయి. కలెక్టర్ కార్యాలయ సముదాయాలకు సంబంధించిన అనేక సౌకర్యాలు కల్పించడంలో కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు.

కలెక్టరేట్ ప్రాంగణంలో రోడ్లు, పార్కింగ్ షెడ్లు

కలెక్టరేట్ ప్రాంగణ సముదాయంలో ఇప్పుడిప్పుడే అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. హైవే నుంచి కలెక్టరేట్ వరకు రోడ్డుకు అటు, ఇటు వైపు పెద్దపెద్ద మొక్కలు తెప్పించి నాటించారు. కలెక్టరేట్ ఆవరణలో అవసరమైన తారురోడ్డు పనులు కూడా ముమ్మరంగా కొనసాగుతున్నాయి. జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌తోపాటు జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఆర్వో సత్యనారాయణలకు సంబంధించిన వాహనాల పార్కింగ్‌కు కూడా ప్రత్యేకంగా ఇటీవల షెడ్డును ఏర్పాటు చేశారు. ద్విచక్ర వాహనాలకు, ఇతర వాహనదారులకు కూడా పార్కింగ్ ఏర్పాట్లు చేయడంతో కార్యాలయ ఆవరణం కొత్త సొబగులను సంతరించుకుంటోంది. కడప-చిత్తూరు జాతీయ రహదారి పక్కనే కలెక్టరేట్‌కు సంబంధించి ఏర్పాటు చేసిన స్వాగత ఆర్చిని అద్భుతంగా తీర్చిదిద్దారు. దీంతో కలెక్టరేట్ ఆర్చి ప్రజలను ఆకట్టుకుంటోంది.

నూతన కలెక్టరేట్, బంగ్లాల నిర్మాణానికి చర్యలు

రాయచోటిలో నూతన కలెక్టరేట్‌తోపాటు ఉన్నతాధికారుల నివాస బంగ్లాలకు సంబంధించి ఇప్పటికే స్థల సేకరణ పూర్తయింది. రింగ్ రోడ్డుకు సమీపంలో సుమారు 45 ఎకరాల్లో నూతన కలెక్టరేట్ భవనాలకు సంబంధించిన స్థలాన్ని ఎంపిక చేశారు. త్వరలో కలెక్టరేట్‌కు సంబంధించి శంకుస్థాపన జరగనుంది. ప్రసుత్త కలెక్టరేట్ వెనుకవైపున సుమారు 8-10 ఎకరాలు చదును చేసి నిర్మాణాలకు చకాచకా ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడ కలెక్టర్, జేసీ, డీఆర్వో బంగళాలు నిర్మించాలని ప్రణాళికలు రూపొందించారు. చుట్టూ ప్రహరీ నిర్మాణాలతోపాటు ఇతర పనులు చేపట్టనున్నారు.



కలెక్టరేట్‌లోకి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన ఆర్చి



కలెక్టరేట్ ఆవరణలో జరుగుతున్న తారురోడ్డు పనులు

102 అడుగుల స్తంభంపై జాతీయ జెండా ఏర్పాటుకు చర్యలు



ఏర్పాటు చేసిన 102 అడుగుల స్తంభం

రాయచోటికి తలమానికంగా నిలిచేలా ప్రత్యేక స్తంభంపై జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. అందుకు సంబంధించి కలెక్టరేట్ స్వాగత ఆర్చి పక్కన కడప-చిత్తూరు జాతీయ రహదారిపై ప్రత్యేక ఆకర్షణగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. అక్కడే 102 అడుగులతో ఒక పెద్ద స్తంభాన్ని ఇప్పటికే ఏర్పాటు చేశారు. జనవరి 26వ తేదీ నాటికి పెద్ద జాతీయ జెండాను ఎగురవేసేలా, అందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నారు.

కలెక్టరేట్‌లో చురుగ్గా అభివృద్ధి పనులు



కలెక్టరేట్‌లో అన్ని శాఖలకు సంబంధించిన మౌలిక వసతులతోపాటు ప్రాంగణంలో సుందరీకరణకు చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా ఇప్పటికే మొక్కలను తెప్పించి నాటించడంతోపాటు స్వాగత తోరణాన్ని ఏర్పాటు చేశాం. రానున్న కాలంలో మరింత పచ్చదనంతోపాటు ఇతర వసతులు కల్పించనున్నాం. ఒక ప్రత్యేక స్తంభంపై జాతీయ జెండాను ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– గిరీషా పీఎస్, కలెక్టర్, అన్నమయ్య జిల్లా

క్లుప్తంగా

అటవీ అధికారులకు నెమలి అప్పగింత



కదలలేని స్థితిలో ఉన్న నెమలి

రాజంపేట : పంట పొలంలో లభ్యమైన జాతీయపక్షి నెమలిని అటవీ అధికారులకు అప్పగించారు. ఊటుకూరు గ్రామ పరిధిలోని రవి శేఖరాజు అనే రైతుకు తన పొలంలో నెమలి కదలలేని స్థితిలో శనివారం కనిపించింది. ఆయన అటవీ అధికారులకు సమాచారం అందించారు. అటవీ సిబ్బంది పంట పొలాల వద్దకు చేరుకొని ఆ నెమలిని ఊటుకూరు యువకులు హరికృష్ణ, అశోక్ సాయంతో రాజంపేట రేంజర్ నారాయణకు అప్పగించారు. వారు నెమలిని చికిత్స నిమిత్తం పశువైద్యశాలకు తరలించారు. ఈ సందర్భంగా రేంజర్ నారాయణ మాట్లాడుతూ చికిత్స అనంతరం నెమలిని అటవీ ప్రాంతంలో వదలాల, జంతుశాలకు తరలించాలా అనే విషయం ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు అమలు పరచడం జరుగుతుందని స్పష్టం చేశారు.

పోలీస్ కస్టడీకి హత్యకేసు నిందితులు

మదనపల్లె : తల, మొండెం వేరు చేసిన హత్య కేసుకు సంబంధించి సబ్‌జైలులో ఉన్న నిందితులను శనివారం తాలూకా పోలీసులు పీటీ వారెంట్‌పై కస్టడీకి తీసుకున్నారు. నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లె పంచాయతీ గుండ్లబురుజుగొల్లపల్లెకు చెందిన జంగిటి రమేష్ మదనపల్లె మండలం వేంపల్లె సమీపంలోని మామిడితోపులో ఇటీవల దారుణ హత్యకు గురయ్యాడు. ఈ కేసులో ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణకు సంబంధించి నిందితులైన గణేష్, ధనంజయ అలియాస్ ధన, మహమ్మద్‌ను పీటీ వారెంట్‌పై సబ్‌జైలు నుంచి అదుపులోకి తీసుకున్నారు. హత్యకు దారితీసిన పరిస్థితులు, నేపథ్యం, జరిగిన తీరు తదితర అంశాలకు సంబంధించి అన్ని కోణాల్లో పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని ఎస్‌ఐలు చంద్రశేఖర్, సుధాకర్ తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- బ్యాంక్‌ల వద్ద రెక్కీ నిర్వహించి సినీ ఫక్కీలో చోరీ
- రాజస్థాన్, కర్ణాటక, ఏపీలో నేర చరిత్ర



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : రద్దీగా ఉన్న బ్యాంకుల్లో రెక్కీ నిర్వహించి.. ఎక్కువ డబ్బులు డ్రా చేసిన వారిని గమనించి.. వారి దృష్టి మరల్చి చోరీకి పాల్పడే అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు పట్టుకున్నారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కేశప్ప వివరాలు వెల్లడించారు. కర్ణాటకలోని శివమొగ్గ జిల్లా భద్రావతి కేశవపురానికి చెందిన ఆర్.సునీల్ అలియాస్ బాలు (29) అనుచరులతో కలిసి కర్ణాటకలోని భద్రావతి, ఉడిపి, బెళగావి, రాజస్థాన్‌లోని నాగౌర్, కిషన్‌గాడ్, బేవార్, చిత్తోడ్‌ఘడ్ జిల్లాలు, ఏపీలోని తిరుపతి, మదనపల్లె, పలమనేరు, గాలివీడు, కనేకల్లు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. గతేడాది ఏప్రిల్ 27వ తేదీన పట్టణంలోని కెనరా బ్యాంకులో కురబలకోటకు చెందిన మురళి బంగారు నగలను తాకట్టు పెట్టి రూ.2 లక్షల 50 వేలు రుణం తీసుకున్నాడు. డబ్బులను ప్లాస్టిక్ కవర్లో పెట్టి, మోటార్‌సైకిల్ సైడ్‌బ్యాగ్‌లో పెట్టుకుని తన అన్న మల్లికార్జునతో కలిసి స్వగ్రామమైన కురబలకోటకు బయలుదేరాడు. వీరిని బ్యాంకు వద్ద నుంచే గమనిస్తున్న సునీల్ తన అనుచరులైన రవి, హరీష్‌తో కలిసి వెంట వచ్చాడు. ఈక్రమంలో మురళి మార్గంమధ్యలో మార్కెట్‌యార్డు ఎదురుగా ఉన్న హోటల్ వద్ద భోజనానికి నిలిపాడు. సునీల్ తన అనుచరులతో కలిసి మురళీ ద్విచక్రవాహనానికి గాలి తీసేశారు. భోజనం చేసుకుని బయటకు వచ్చిన మురళీ బండి చక్రానికి గాలి తగ్గి ఉండటం గమనించి పంక్చర్ అయి ఉంటుందని భావించి, మార్కెట్‌యార్డు ఎదురుగా ఉన్న దుకాణం వద్దకు వెళ్లాడు. పంక్చర్ వేయించుకునే హడావిడిలో ఉండగా, సునీల్ అనుచరులు మురళీని మాటల్లో దింపారు. ఒక వ్యక్తి నమ్మకం కలిగేలా మాటలాడుతుండగా, మరో వ్యక్తి బైక్‌ను స్టార్ట్ చేసుకుని సిద్ధంగా ఉంటే, ఇంకో వ్యక్తి బండి సైడ్‌బ్యాగ్‌లో ఉంచిన నగదు కవర్‌ను దొంగలించుకుని వెళ్లారు. ఈ ఘటనపై బాధితుడు మురళీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సునీల్‌ను పట్టుకుని డబ్బులు రికవరీ చేశారు. ఈ కేసులో మిగిలిన నిందితులను త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో టూటౌన్ సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ చంద్రమోహన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంలోనే పెద్ద బెరైటీస్ నిక్షేపం మంగంపేట



గనులపై విద్యార్థులకు అవగాహన కల్పన కార్యక్రమంలో శాస్త్రవేత్తల బృందం

ఓబులవారిపల్లె : ప్రపంచంలో అతి పెద్ద బెరైటీస్ నిక్షేపాలు మంగంపేట గనులలో ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ స్టేట్ యూనిట్ శాస్త్రవేత్తల బృందం డైరెక్టర్ జీజీఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం మంగంపేట బెరైటీస్ గనులను జీఎస్‌ఐ, జియో శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరన్ రీజియన్ ఏడీజీ హెచ్‌ఓడీ జనార్దన్ ప్రసాద్, జీఎస్‌ఐ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ డీడీజీ హెడ్‌ఎంవీ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఏపీ స్టేట్ యూనిట్ డీడీజీ రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు మంగంపేట బెరైటీస్ గనులను పరిశీలించి, వాటి ప్రాముఖ్యతను ఏపీఎండీసీ పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు తెలియజేసినట్లు చెప్పారు. భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా కనుగొన్న, అన్వేషించిన మంగంపేట బెరైటీస్ నిక్షేపాలు దాదాపు 74 మిలియన్ టన్నుల అంచనా వనరులతో ప్రపంచంలోనే అతి పెద్ద సింగిల్ బెడ్ బేరైట్ నిక్షేపం అని పేర్కొన్నారు. ప్రపంచంలోని బెరైటీస్‌ల నిల్వలలో 28 శాతం, జాతీయ బెరైటీస్‌లలో 98 శాతం ఉంటాయని తెలిపారు. 1982లో భారత ప్రభుత్వం జాతీయ భౌగోళిక వారసత్వ స్మారక చిహ్నంగా ప్రకటించిందని అన్నారు. కావున భవిష్యత్తు తరాల కోసం సంరక్షించడం, ఈ సమాచారాన్ని అందరికీ అందించడం మన కర్తవ్యమని పేర్కొన్నారు. అనంతరం ఏపీఎండీసీ జియోలాజికల్ వారు గనుల ప్రాముఖ్యత, ఖనిజం, వాటి వినియోగంపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జియో శాస్త్రవేత్తల బృందం సీనియర్ జియాలజిస్టు పామిశెట్టి హరికుమార్, జీఎస్‌ఐ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ జియాలజిస్టు ప్రశాంత్ కుమార్ శుక్లా, సీపీఓ వెంకటరమణ, డీజీఎం బెనర్జీ జియాలజిస్టు శివసాయి తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

రామాపురం : మండలంలోని సుద్దమళ్ల పంచాయతీ దూదేకులపల్లెకు చెందిన మతిస్థిమితం లేని మహిళ కొండూరు దిల్షాద్ (32) శనివారం క్రిమి సంహారిణి మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వైఎస్సార్ జిల్లా సికేదిన్నె మండలానికి చెందిన దిల్షాద్‌కు 13 ఏళ్ల క్రితం అన్నమయ్య జిల్లా రామాపురం మండలం దూదేకులపల్లెకు చెందిన కొండూరు దర్బార్‌బాషాతో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఈమె భర్త దర్బార్‌బాషా జీవనోపాధికై గల్ఫ్ దేశానికి వెళ్లి వస్తుంటాడు. ఈ మధ్య కాలంలో ఆమెకు అప్పుడప్పుడు మతిస్థిమితం లేకుండా వీధుల్లో తిరుగుతుండేదని బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమెను చికిత్స కోసం 2022 సెప్టెంబర్‌లో కడప రిమ్స్‌కు తరలించారు. మృతురాలి భర్త 2 నెలల క్రితం జీవనోపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. అప్పటి నుంచి ఆమె ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారింది. శనివారం క్రిమి సంహారిణి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి తీవ్ర అస్వస్థతకు గురైంది. బాధితురాలిని చికిత్స కోసం 108లో రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కేశాలు అందజేత

మదనపల్లె సిటీ : క్యాన్సర్ బాధితుల ముఖంలో చిరునవ్వు చిందించడానికి హెల్పింగ్ మైండ్స్ తలపెట్టిన హెయిర్ డొనేషన్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల వద్దనున్న హెల్పింగ్ మైండ్స్ కార్యాలయంలో పట్టణానికి చెందిన దీపిక తన కేశాలు అందజేశారు. ఆమెకు నిర్వాహకులు అబూబకర్ సిద్దిక్ పూల మొక్క అందించి అభినందించారు.

భూ కబ్జాపై రైతుల నిరసన

రాజంపేట రూరల్ : మండల పరిధి ఊటుకూరు సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న వంక పొరంబోకు స్థలాన్ని కబ్జా చేశారని ఆరోపిస్తూ రైతులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు జె.నాగేశ్వరరావు మాట్లాడుతూ 1497 సర్వే నంబరులో 43 సెంట్ల వంక పొరంబోకు స్థలం ఉండేదన్నారు. అదే విధంగా 552 సర్వే నంబర్‌లో దాదాపు 50 సెంట్ల ప్రభుత్వ స్థలం ఉండేదన్నారు. ఈ మొత్తం స్థలాన్ని చేజెర్ల వాసుదేవరాజు కుటుంబీకులు కబ్జా చేశారని ఆరోపించారు. ఈ విషయమై 2019లో తాము కోర్టును ఆశ్రయించామన్నారు. వంక ఆక్రమణలు తొలగించాలని 2022 డిసెంబర్ 22న కోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు రెవెన్యూ అధికారులు ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు. వంక స్థలంలో పొలాలకు వెళ్లే రహదారి ఏర్పాటు చేయాలని కోరారు. ఇదే సమయంలో అక్కడికి చేరుకున్న ఊటుకూరు వీఆర్‌ఓ వెంకటేశ్వర్లు, గ్రామ సర్వేయర్ శ్రీనివాసులు సర్వే చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ డీటీ శ్రీకాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు తాము సర్వే నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. సర్వే అనంతరం నివేదికను శ్రీకాంత్‌రెడ్డికి అందజేస్తున్నట్లు తెలియజేశారు. అనంతరం కబ్జాదారులకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలియజేశారు. ఇదే విషయంపై కబ్జా చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న సీ వాసుదేవరాజును వివరణ కోరగా తమకు ఈ స్థలం 1921లో రిజిస్ట్రేషన్ అయ్యిందని తెలియజేశారు. తమ వద్ద పాసుపుస్తకాలు ఉన్నాయని, తాము కూడా కోర్టు ద్వారా న్యాయం పొందుతామన్నారు. నిరసన కార్యక్రమంలో రైతులు ఎం. సుబ్రమణ్యం, ఎం.సుబ్బనరసయ్య, కె.వెంకట్రామయ్య, కె.సుబ్బరాయుడు, కే ఆనంద్, కె. సుబ్బనరసయ్య, కే శంకరయ్య, శివారెడ్డి, రెడ్డెయ్య, జే సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసు నిందితుడి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితుడు భానుప్రకాష్

మదనపల్లె : పట్టణంలోని ఎస్టేట్‌లో తమలపాకుల వ్యాపారి వారాధిపై హత్యాయత్నం కేసులో శనివారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ మురళీకృష్ణ శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. కలికిరికి చెందిన భానుప్రకాష్ ఆర్థిక లావాదేవీలకు సంబంధించి శుక్రవారం పట్టణంలోని ఎస్టేట్‌కు చెందిన వారాధిపై కత్తితో దాడి చేసి హత్య చేయడానికి ప్రయత్నించాడు. వారాధి ఏడాది కిందట వాల్మీకిపురం మండలం సాకిరేవుపల్లెకు చెందిన రెడ్డిశేఖర్‌కు రూ.90 వేలు అప్పు ఇచ్చాడు. అతడు తన మరదలైన పార్వతికి ఇచ్చాడు. ఆమె సక్రమంగా వడ్డీ చెల్లించకపోవడంతో వీరి మధ్య వివాదం నడుస్తోంది. ఇందులో భాగంగా వారాధిని హత్య చేస్తే డబ్బు చెల్లించే పని ఉండదని.. పార్వతి, ఆమె కుమారుడు భానుప్రకాష్ పథకం పన్నారు. ఈ నేపథ్యంలో భానుప్రకాష్ శుక్రవారం మదనపల్లెకు చేరుకుని వారాధితో గొడవ పెట్టుకుని కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా, అతడు నేరం అంగీకరించాడు. శనివారం నిందితుడిని అరెస్ట్ చేసి హత్యకు ఉపయోగించిన కత్తి స్వాధీనం చేసుకున్నారు.

గ్రామీణ రోడ్లను పరిశీలించిన ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ

రాజంపేట : రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లను రోడ్లు భవనాల శాఖ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. తాళ్లపాక, ఆకేపాడు, చక్రంపేట, టంగుటూరు-ఓబిలిరోడ్డు, వీరబల్లిలోని రోడ్లను ఆయన పరిశీలించారు. ఇదిలా ఉండగా గతంలో పలు ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు, అలాగే కొత్త వాటి నిర్మాణంపై ప్రతిపాదనలను ఏపీఆర్‌డీసీ చైర్మన్ కనుమూరి రాజబాబు, ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న దృష్టికి ఏపీఆర్‌డీసీ స్టేట్ డైరెక్టర్ గండికోట గుల్జార్‌బాషా తీసుకెళ్లారు. దీంతో ఈఎన్‌సీ రోడ్లను పరిశీలించారు. స్థానిక రోడ్లు భవనాల అతిథి గృహానికి ఆయన చేరుకున్న సందర్భంగా ఏపీఆర్‌డీసీ (ఆంధ్రప్రదేశ్ రోడ్ల డెవలప్‌మెంట్ కార్పొరేషన్) డైరెక్టర్ గండికోట గుల్జార్‌బాషా మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఆర్‌డీసీ ప్రతిపాదిత రోడ్లకు వెంటనే నిధులు మంజూరు చేయాలని ఈఎన్‌సీని కోరామన్నారు. దాదాపు రూ.30 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ మహేశ్వరరెడ్డి, రాజంపేట ఈఈ సహదేవరెడ్డి, డీఈ విజయచంద్రారెడ్డి, పలువురు ఇంజనీర్లు పాల్గొన్నారు.

రక్షణ శాఖకు సాంకేతికత దోహదం



సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న డీఆర్‌డీఓ (చెన్నై)సీటీఓ కృష్ణకుమార్

రాజంపేట : భారతీయ రక్షణ శాఖకు సాంకేతికత ఎంతగానో దోహద పడుతోందని మినిస్టర్ ఆఫ్ డిఫెన్స్ (డీఆర్‌డీవో, చెన్నై) సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.కృష్ణకుమార్ అన్నారు. శనివారం స్థానిక ఏఐటీఎస్‌లో అధ్యాపకులు, విద్యార్థులకు నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. నానోటెక్నాలజీని ఉపయోగించి సైనికుల దుస్తులు తయారీ చేయడం జరుగుతోందన్నారు. అత్యాధునిక రోబోట్స్ దేశానికి ఉపయోగ పడే విధానం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. అధ్యాపకులు పరిశోధనలు విస్తృతంగా పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో ముఖాముఖి నిర్వహించారు. సమావేశంలో అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ, ఆర్‌అండ్‌డీ డీన్ డాక్టర్ శివరామిరెడ్డి, కో-ఆర్డినేటర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.